కుమార కిరణాలు

వచన కవితల సంపుటి

గౌరాబత్తిన కుమార్ బాబు

“FOR FREE CIRCULATION”

ముందుమాట

ఈ వచన కవితా సంపుటిలోని కవితలు నేను ఆగస్ట్,2018 నుండి నవంబర్,2019 మధ్య కాలంలో రాసినవి. ఈ సంపుటి లోని అన్ని కవితలు ప్రతిలిపిలో అచ్చయ్యాయి.కొన్ని కవితలను తెలుగువెలుగు,ఆంధ్రజ్యోతి పత్రికలకు పంపగా అవి తిప్పిపంపబడ్డాయి.ప్రతిలిపిలో మాత్రము కొన్ని కవితలు విమర్శకుల ప్రశంశలు పొందాయి. ఈ కవితలు నేను రచయితగా,కవిగా మారాక శైశవ దశలో రాసినవి గాన లయకన్నా వచనం ఎక్కువగా పాటకులకు కనబడవచ్చు. ఈ కవితా సంపుటి పాటకులకు మంచి అనుభూతిని కలిగిస్తుంది అని ఆశిస్తూ....

మీ

గౌరాబత్తిన కుమార్ బాబు

అంకితం

“కుమారకిరణాలు” అనే ఈ కవితసంపుటిని నేను నా తొలి గురువైన మా తాతగారు శ్రీ పి.పుల్లయ్య గారికి అంకితమిస్తున్నాను.

ఒకటవ భాగం

విసుర్లు – విమర్శలు

i.తెలంగానంటు కొరకు అసువులు బాసెనట అమాయకుండ్రు,
రాజశేఖరుండు అస్తమించిన ఊపిరి వదిలెనట అర్భకుండ్రు,
కానరారేరీ వీరిలో ఆ నాయకుల కోటరీండ్రు,
ఇదేమి చోద్యము రా ఆంధ్రుడా!

ii.ద్రవిడిజం, అంబేద్కరిజం తెచ్చాయి రిజర్వేషన్ల యుగం,
మాకూ కావాలి ఈ కోటాలూ,వాటాలు అని చేస్తున్నాయి మరికొన్ని కులాలు పోరాటం,
పోయేదెన్నడు ఈ పాడు కులాల కోలాటం!

iii.గాంధీ కళ్ళజోడు గురుతుగా మారిననూ స్వచ్ఛ భారతము అను స్వప్నము సాకారము కాలేదు
సత్యము -అహింసలలో' అ 'అటుఇటు జేరి అసత్యము,హింస నేతల శైలిగ మారెను
స్వదేశీ నినాదము పోయి ఆవహించెను భారతమును విదేశీ
సేద్యము సళువుగ మారి కరచుగా మారిపోతున్నది మన రూపాయి
జయంతుల పేరిట గాంధేయవాదముకు వర్ధంతులు జరుపుచున్నారు మన నాయక శిఖామణులు

iv. సామ్రాజ్యవాదం పోయింది,సామ్యవాదం పోయింది,
బ్రతుకు భయం పోయేదెన్నడు భారతీయులకు?
జాతీయీకరణ,సరళీకరణ తేలేదే సామాజిక భద్రత.

v.చరవాణీలతో కొందరు పడతులు మధురవాణీలుగా మారెను,
చాటింగులు తెచ్చె మార్కుల్లో కటింగు,
ధూమపానం,మద్యపానం కన్న చేటుచేయు ఈ చాటు.

vi.ప్రేమయని మగడి మతి పోగొట్టెను ఓ మగువ,
ఊహాలోకమున విహరించి పుడమి జేరిన వానికి మతి భ్రమింపజేసెను ఆ మగువ,
తల్లడిల్లె తల్లి మనసు,తలపుకు రాదు ప్రేమ ఆ మగువకు.

vii. రామాయణం విషతుల్యమన్న ఓ రంగనాయకమ్మ,
రాముడి ప్రతిమను తగలెట్టిన ఓ రామస్వామి,
రాముడిని కాక చూపెను మీరు రావణుడిని,
పరకాంత పై పోలేదే పాడు కోరిక మరి.

తెలుగు భాష

i. నా జాతి అంధక జాతి,నా భాష తెలుగు భాష, నా యాస నెల్లూరి యాస;
అంగ్లంబు నేర్చినా ఆంధ్రుడను నేను, నా భాష అజంత భాష;
నేను పుట్టింది తెనుగున,నేను ఏడ్చింది,నవ్వింది తెనుగున,నా యాతన తెనుగున,
నా సంతోషము తెనుగున,చివరకు చచ్చునప్పుడు పలికెడి చివర మాట తెనుగున.

ii. ఆరు మాండలికాలతో అలరారు భాష మన తెలుగు భాష,
వేయి ఏడుల లిఖిత నానుడి,అంతకు వేయి ఏడుల మౌకిక,శాసన నానుడులున్న నుడి,
ఎన్ని నుడులు నా నుడిపై దాడులు సలిపినా అజరామరముగా నుండును నా తెలుగు నుడి,
తెలుగు బిడ్డా! పర్లేదు నేర్చు ఇతర నుడులు,కాకపోతే చాటరా మన నుడి గొప్ప వీడి.

iii. అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా! అని చీదరింపబడక,
అమ్మ నుడితో కూడి అరదేసీయ నుడులు నేర్చి జగతిన జయకేతనము ఎగుర వేసే మొనగాడిగా మారరా ఓ తెలుగు వాడా !

ఆంధ్ర బౌద్ధం

కళింగ దేశమున కలియ తిరిగి,కృష్ణా తీరాన్ని చుట్టు ముట్టి సింహళ జేరెను తథాగతుని ధమ్మ శాసనము,
సంగమిత్ర మాత కట్టి కొలిచిన ఆదుర్రు స్థూపము, నాగార్జునాచార్యుని మహా చైత్యము,కుబేరకుని ప్రతిపాలపుర మందిరము మనకే సొంతము,
మహాయానమునకు నాంది పలికి,తాంత్రిక బౌధమును ఆచరించి మార్చి వేసెను మహా స్థూపములను లంజ దిబ్బలుగా!

మూఢ భక్తి

i. కామితార్థములు తీర్చమని దేవునకు మ్రొక్కులు మ్రొక్కే జనులకు
ఆత్మజ్ఞానంబు యొక్క ఎరుకయే లేదే
సాగిల పడి,మ్రొక్కులు మ్రొక్కి,బొక్కసం నింపిన పాపము
కడతేర్చుటకు దేవుడు దళారీయా

ii. ధనము వచ్చి జేరెను వాయు రూపముగ నున్న గరళ కంటుడి జెంతకు,
రాతి శిల్పములను స్వర్ణకవచములు కప్పి వేసెను,
అర్చకులు యచకులుగా మారి శతకము చదివించిన గాని శటగోపము పెట్టననెను,
రాహుకేతు పూజలను ధనమను సర్పము కబళించెను,
ఆధ్యాత్మిక భావన పోయి భౌతిక భావనలే మిగిలెను.

iii.మూగ జీవుల రుధిరధారలతో అర్చించవలదు అమ్మను,
పసి ప్రాణి మనస్సుతో అర్పించు రక్త చందనము, కట్టె పొంగలి చాలును అమ్మలగన్నయమ్మకు,
చంద్రశేఖరుని ఆజ్ఞ గైకొన్న కంచి నుండి చంద్ర కాంతులు విరజిమ్మును కలిమిలి సీమపైన.

ద్రవిడ ఉద్యమం

అయ్యర్ల ఆధిపత్య అంతముకు ఆత్మగౌరవ ఉద్యమం నడిపెను నాస్తిక రాముడు,
కులముపై కత్తి దూసి,దేవుని ప్రతిమలను పగులగొట్టెను,సమసమాజ స్థాపనకై దళితుల కోటాలకు పోరాటాలు సాగించెను,
ఆర్య-ద్రావిడ భేదంబు జూప అమ్మ తమిళంబును జూపెను,
అధికారము కొరకు ద్రవిడ కళగంబు నుండి ఉద్భవించెను ద్రవిడ మున్నేట్ర కళగంబు,
అధికారము సాధించి పెట్టె ప్రాకృత భాష తో వైరంబు,
అన్నఅస్తమించెను,కరుణానిధి నిధి కూడబెట్టెను,
సామ్యవాదము,ప్రజాస్వామ్యము పోయి, వ్యక్తి స్వామ్యము ఆవహించెను తమిళకంబును.

నెహ్రూ విరచిత బాపూజీ కన్న కల

ఏ భారతంలోనైతే కడు బీద వాడు కూడా ఇది నా దేశం అని మనసారా భావించగలడో ...

ఏ భారతంలోనైతే బలహీనులు కూడా గొంతెత్తి నినదించగలరో ...

ఏ భారతంలోనైతే ధనిక బీద వర్గ భేదాలు పొడసూపవో ...

ఏ భారతంలోనైతే అన్ని మతాల వారూ సామరస్యంతో జీవిస్తారో...

అట్టి భారతం కోసం నా స్వేద ధారలు చిందిస్తాను ...

అట్టి నా భారతంలో అంటరానితనానికి అణుమాత్రమైనా చోటు లేదు...

అట్టి నా భారతంలో మత్తుకు మగువకు బానిసలయ్యే జనులు కానరారు ...

అట్టి నా భారతంలో స్త్రీ పురుషులు సమానులు...

ఇదియే నా కలల భారతం.

మరో విప్లవం

రాబోతోంది రాబోతోంది మరో విప్లవం ,

ఇది రష్యా విప్లవాన్ని మరిపిస్తుంది,

ఇది బాపూజీ రగిల్చిన నైతిక విప్లవాన్ని గుర్తుకు తెస్తుంది ;

ఇది బ్రహ్మం గారి కాల జ్ఞానం కాదు నోస్ట్రడామస్ నోటి మాట కాదు ,

ఇది సగటు భారతీయుడి గుండెలో గూడు కట్టుకుంటున్న ప్రళయ విహంగం ,

ఇది రాజకీయ పార్టీల తోలు కప్పుకున్న రాచ కుటుంబాల తోలు తీస్తుంది,

ఇది కార్పొరేట్ల మాటున బ్యాంకుల చాటున జరుగుతున్న మౌన దోపిడీ పీచమనుస్తుంది,

ఇది ధర్మ దాతల వేషమేసిన దోపిడీగాండ్ల బట్టలూడదీస్తుంది ,

ఇది క్యాపిటలిజం కోరలు పెరికి జాతి సంపదకు ట్రస్టీలను తెస్తుంది

ఇది సోషలిజాన్ని తోసిరాజని సర్వోదయమును సర్వతోముఖము నొనరిస్తుంది ,

ఇది బాపూజీ శాంతి రాగం , నేతాజీ ఆవేశపు తాళం మిళితమైన చైతన్య గీతం,

ఇదే కల్కి అవతారం , ఆ విశ్వంభరుడు దాల్చే దశావతారం.

విజయనగర వీరత్వం

i. ఉదయగిరిని పట్టి, కొండపల్లిని కొట్టి, కటకం చేరేలోపు తెలుగునేలపై రాయలసేనలు పారించిన రక్తపు టేరులు కనుమరుగాయను అష్టదిగ్గజాల పాండిత్య ఘోషలో,
గోవా తీరాన అల్బకర్కు అను ముష్కర బుడతకీచు ముసలమానుల మానప్రాణాలు బలిగొన్నప్పుడు మందహాసము చిందించెను మన మూరురాయగండడు,
కలియుగ వైకుంటమును కొల్లగొట్టుకు బయలుదేరిన బుడతకీచుల ముఠా గాలి వానకు గల్లంతాయను, అది తెలిసియూ గమ్ముగుండెను రామ రాయలు,
రాజకీయ, సాహిత్య చరిత్రల నడుమ బక్క చిక్కి కానరాకుండా పోయెను సామాన్యుని సామాజిక చరిత్ర.

ii. ఔరా ! నృసింహ రాయా , సాళువ భూపాలుడి కన్న బిడ్డనూ , పసి రాజునూ కడ తేర్చి నాయకునివి కాస్తా రాయలుడివైనావే !
అహో ! ఆంధ్ర భోజా ,బుడత కీచుల మాట నమ్మి అబ్బ వంటి అప్పాజీని అంధుడను జేసినావే !
ఏమయ్యా ! అచ్యుత రాయ , రెండు వందల మంది భార్యలను గైకొని ఆడుదానిని భోగ వస్తువుని జేసినావే !
పసివాని రక్తము పునాదిగా ఏర్పడ్డ తుళువ వంశము అలియ బాల్పడి ఆంతరించెను గదా.

iii. విజయనగర రాజ్య లక్ష్మి కి చెదలా పట్టిన ప్రౌఢ రాయలును కానలుకు తరిమి వేసిన ధీరోత్తమా!
పద కవితా పితామహునిచే శ్రీపదపురిన పద కుసుమాల జడివాన కురిపించిన కవి ప్రియ రాజా !
సాళువ నరసింహ రాయ ,జయహో ,దిగ్విజయహో !

2019 సార్వత్రిక ఎన్నికలలో ఓటరు తీర్పుపై ఆగ్రహం మఱియు వేదన

i. అవినీతి పరులను అక్కున చేర్చుకునే జనమున్న దేశంలో,
నియంతలకు నీరాజనాలు ఇచ్చే ఏలితులు ఉన్న జగతిలో;
పుట్టినందుకే ఈ మనోవేదన,
కులము చూసి,మతము చూసి పాలకులను ఎన్నుకునే ఏలితులున్న పాడు జాతి నా భారత జాతి,
మంచిలేని మందికాలు జనము కోరుకున్నప్పుడు నాకెందుకీ సామాజిక చింతన; నాకెందుకీ మనోవేదన,
నేల తల్లిని తవ్వి అమ్మివేసే తోడేళ్లు గద్దె నెక్కి రేపు రాజ్యమేలుతుంటే ,అట్టి రాజ్యమే ఈ పాడు జనం కోరుకుంటే,ఎటు పోతుందో ఈ నా ఆణియము,
ఈ నా ఆణియము తుప్పుబట్టిన ఒక ఆభరణం;
ఇక నా మనస్సు స్వేచ్ఛగా పురివిప్పుకుంటుంది,సామాజిక చింతన,మందికాలనే మదగజాలు దానిని బంధింపలేవు,
నా భుక్తి నేను చూచుకున్న చాలును నా ఈ పేరు గొప్ప,ఊరు దిబ్బ దేశంలో.

ii. ఆంగ్లమే గాని ఆంధ్రమ్ము రాదనువాడు,
కులము,కులము అంటూ పడి చచ్చు వాడు,
కలుముతో పాటు మతము అను మరో తోక తగిలించుకున్నవాడు,
నోటు లేనిదే ఓటు వేయనివాడు,
ఎవరయ్య ఎవరు వాడు ఇంకెవరయ్య తెలుగు వాడు.
(సినారే కవితకు పేరడీ)

370 అధికరణం రద్దు చేసినందుకై

అశోకుడు నిర్మించిన శ్రీనగరం ప్రకాసించునదెన్నడు,
ఆదిశంకరుడు నడయాడిన భూమి వేదాంత కుసుమాలను వెదజల్లునదెన్నడు,
ఇలలోని స్వర్గం అమరపురిని తలపించునదెన్నడు ,అని పరితపించెను ప్రతి హైందవుడి హృదయాంబుజాలు,
ఈనాడు అట్టి శుభ సమయానికి నాంది పలికాడు నరేంద్రుడు,
ఉగ్రమూకల కోరలు పెరికేటందుకు,
ఊరూవాడా శాంతిసౌరభాలు విలసిల్లేటందుకు,
ఋతువులు కాశ్మీర అందాలను ఇనుమడింపజేసేటందుకు,
ఎన్నో అడ్డంకులను ఇట్టే తొలగించి,
ఏళ్ల తరబడి కన్న కలను నేర్పుతో,ఓర్పుతో నిజం చేసిన స్వయంసేవకులారా!
అందుకోండి మా వందనాలు ,మీ
అంతఃకరణానికి మా కృతజ్ఞతాకుసుమాలు.

చేనేత దినోత్సవం సందర్భంగా

కరి చర్మధారి కొరకు నేత నేసి దేవల బ్రహ్మ చేనేతకు నాంది పలుకగా,
యుగాల పర్యంతం మనిషి సిగ్గును కాపాడుతూ,
మగ్గపు చప్పుడే వేద నాదముగా ,రాట్నము తిప్పుటే శివ జపముగా,
సాగిపోతున్నవి చేనేత బ్రతుకులు.
ఆదిశక్తి అందించే అత్మబలముకు కండ బలమును,బుద్ధి బలమును మేళవించి
పత్తిని తగు విధముగా రంగరించే కళయే చేనేత.
చేయితో **నే**యిని **త**రింప చేసే కర్మయోగమే **చేనేత**,
ధర్మవరపు పట్టు,వెంకటగిరి జిందానీ,పొందూరు ఖద్దరు,ఇవి తెలుగు వారి మకుటంలో వజ్రపు తునకలు,
అమరపురి నుండి బాపూజీ ఆశీర్వదింపంగా చితికి పోతున్న చేనేత బ్రతుకులు వెలుగులీనే రోజు తప్పక మరల వచ్చును.

నవ్యాంధ్ర

i.పాకనాడులో తిక్కన ఉభయ కవితలకు సిడము నెత్తింపంగ,
రేనాడులో వేమన తత్త్వ బోధజేయంగ,
పలనాడులో కవికోకిల కూయంగ,
వేంగినాడులో గద్య తిక్కన గర్జింపంగ,
కళింగ సీమలో ముత్యాలసరాలు మురిపింపంగ,
ఆంధ్రదేశాన చైతన్యం వెల్లివిరిసినదానాడు.
ఆంధ్రరాష్ట్రముగనస్తమించి,నవ్యాంధ్రగా నవ జన్మ నెత్తిన ఈ పురిటిగడ్డ దీనాలాపనలుజేస్తున్నదీనాడు.

ii.విశాలాంధ్ర స్ఫూర్తి ఏనాడో అంతరించింది,సమైక్యాంధ్ర ఏనాడో కాలం చేసింది,
నవంబర్ ఒకటి కాదు కాదు ఇక ఎన్నటికీ ఆవిర్భావ దినం,
అమరజీవి ఆత్మార్పణ జేసింది ఆంధ్ర రాష్ట్రానికై,
భద్రాది రాముడు మినహా నేటి నవ్యాంధ్ర నాటి ఆంధ్ర రాష్ట్రమే,
కాదు కాదు నవంబర్ ఒకటి ఆవిర్భావ దినం,
అక్టోబర్ ఒకటిన జరుపుకోవాలి మనం ఆవిర్భావ దినోత్సవం,ఆనాడు ఘాటించాలి అంజలి మనం
అమరజీవికి,ఆంధ్రకేసరికి.

వైరుధ్యం

నేను కష్టాల కడలిలో చిక్కుకున్నప్పుడు జాలిని వర్షిస్తాయి ఆ కళ్ళు,
నేను సుఖాల దీవిలో విహరిస్తున్నప్పుడు నిప్పులు కక్కుతాయి అవే కళ్ళు.
కష్టాలలో చేయూత నిచ్చుటకు చేతులు రావు,
సుఖాలకై చేయూత నిచ్చిన చేతులూ కావు.

అమ్మ భాష

గోవు పాలు కన్న అమ్మ పాలు మిన్న,
అమ్మ పాలతోటి అబ్బును అమ్మ భాష,
అట్టి అమ్మ భాష కన్న చదువు నేర్చుటకు మిన్న భాష ఉన్నదా?
అమ్మ భాష పై అధికారం అరదేసీయ భాషలు నేర్చుటకు ఆలంబనం,
విజ్ఞాన శాస్త్రం నేర్చుటకు సోపానం.

నాడు మెకాలే పుణ్యాన జాతీయ విద్యకు సమాధి,
నేడు మూర్ఖ పాలకుల మూలంగా అమ్మ భాషకు ఘోరీ,

నాడు వాశిష్టీ మాత మఖనుడు, మాధవుడు,విజయాదిత్యుడు,రాజరాజ నరేంద్రుడు,మూరురాయగండడు - కట్టిరి పట్టం తెలుగుకు.
నేడు జనులెన్నుకున్న జననేతలు తవ్వారు తొట్టం తెలుగుకు.

అమ్మ భాష రాక,పర భాషనూ రాక ఆత్మనూన్యత మిగులును చివరికి ,
నిన్న అమరావతిని చంపుకున్నాము,నేడు అమ్మ భాషను చంపుకుంటున్నాము ,
చిరునామా లేని జాతిగా ఆంధ్ర జాతి మిగులుట తథ్యము.
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు మాధ్యమం తీసేయడం పై నిరసనగా)

మేల్కోండి!

కష్ట జీవులు కడుపు మండి కన్నెర్ర జేస్తే,

ఉడుకు నెత్తురు ఉప్పెనై కబళించదా?

కార్మికుల కన్నీళ్ళు తుడవలేని,కడుపు నింపలేని రాజ్యమెందుకు?

నియంతకు నీరాజనాలిస్తే నీళ్ళు వదలడా రాజ నీతికి,

నేడున్నది ప్రజారాజ్యమా? కాదు,రాజు నెన్నుకునే దౌర్భాగ్యం.

మింగ మెతుకు లేక మొత్తుకుంటుంటే,తిన్న దరగక అరిచే అరుపులంట!

రాయిరప్పలకై రత్నాలు పోసి,రాళ్ళు ఎత్తే కూలీలకు రిక్త హస్తాలు చాచే ఏలికలెందుకు?

పన్ను కట్టడం మానిన నడపగలరా రాజ్యం?ప్రజల సొత్తుపై దొరదేంది పెత్తనం?

నేడు మేల్కొనకున్న మధ్యయుగాల చీకటి కోణం కబళించును నేలను,

మేల్కోండి యువజనులారా! వదలండి కులం,వదలండి మతం,వదలండి ప్రాంతం!

(తెలంగాణ ఆర్.టి.సి కార్మికుల సమ్మెకు సంఘీభావంగా)

రెండవ భాగం

అంతర్ముఖం

i. నాలోని భావతరంగాల సమూహము ఈ మనస్సు,
అది నా గత జన్మానికి చిహ్నం, వర్తమానానికి సంకేతం, నా భవితకు సూచన,
అది శూన్య మయిన తెలియును నేనెవరో నాకు.

ii. పంచభూతాలతో కూడిన నా గూడు చెదిరిపోయింది,
కర్మ ఫలాలు భీతి గొల్పుతున్నాయి,
పండి రాలవలెనన్న ఆశతో తగు గర్భం కోసం వెదకసాగాయి,
మరొక గర్భమందు భావతరంగాలు గూడు నిర్మించుకోసాగాయి,
ఇదే నాకిక ఆఖరి గూడు యన్న పట్టుదల చెదిరిపోయింది బయటకు రాగా!
వచ్చాక అంతా శూన్యమే!

iii. కొలను గట్టున జేరి బుద్ధుని బొమ్మ కాంచుచూ ఉన్న ఆ వేళలో చుట్టూతా ఉన్న రణగొణ ధ్వనులు చెవికి
దూరమయి కనులు మూత పడెను.
లోన పొరలు పొరలుగా ఏవో యాదులు, తరచి చూడగా కారు దీప కాంతులు గాక వెన్నెల కాంతులు, పొగ వాసన గాక
మట్టి వాసన, సున్నపు మేడల అటవి గాక, పచ్చని చెట్టుల అటవి,
ఉరుకు పరుగులు లేక పక్క వాడి యాతనలు కాంచు తీరిక ఉన్న జనులు.
ఇంతలో వీణ నార తెగినట్లు యాదుల దొంతర తెగిపోయింది.

iv. ఆ నిద్రాణమైన నిశీధిలో నా మనస్సు ఊహల విహంగమెక్కి మరో లోకానికి పరుగెత్తింది,
అక్కడ పచ్చదనపు పరిమళ సుగంధాలు వీస్తున్నాయి,
ఆ పరిమళ సుగంధాలు వెదజల్లే అడవి సమూహాల్లో కనుమరుగైపోతామనే గగుర్పాటు లేదు,
అక్కడ పారుతున్న జలపాతాల్లో స్వచ్ఛత చూసి అచ్చెరువొందాను,
ఆ జలపాతాల్లో కాలుష్యపు కోరలు పీక్కు తింటాయనే భయం కానరాలేదు,
అక్కడ దేవుని పేరుతో డాంభికాలు,మూగజీవుల వధలు లేనే లేవు,
అక్కడ మనుషుల్లో నైతిక విలువలు ప్రస్ఫుటమవుతున్నాయి,బతుకు మీద అనిశ్చితి అనే భయం కానరాలేదు,
ఆ లోకంలో నా మనస్సు సేద తీరేలోపు మెలుకువ అనే వలలో చిక్కి ఈ వ్యవహారిక జగత్తులో మరల పడిపోయాను.

మనస్సులోన!

i.జీవము మిథ్య, జగము మిథ్య, శివుడే సత్యము,
జన్మ అనిత్యము,బంధము అనిత్యము,శివుడే నిత్యము.
మరి ఎచటనున్నాడు సత్యమైన,నిత్యమైన ఆ శివుడు,
ఎటుల కాంచాలి ఆ పరబ్రహ్మ స్వరూపమును.
అరిషడ్వర్గమును నిర్జించి ,అంతర్ముఖత్వము నొంది,
మనస్సును ప్రళయకడలిని దాటినంతనే కానవచ్చును బుద్ధి గుహన అణురూపుడయి.

ii.ఎన్నో జన్మలు నీ వున్నావన్న స్పృహ లేకుండా గడిపేశాను;
నా మనస్సు ఆనందపు ఊయల ఊగుతున్నపుడు,
ఆ ఊయల తాళ్ళు తెగిపడి అగాధంలోకి జారి పడిపోయాను;
ఆవహించిన చిమ్మ చీకటిలో మిణుకు మిణుకు మంటూ నీవు తారసపడ్డావు;
నిన్ను చేరితే అజ్ఞానపు మేఘాల వల్ల ఏర్పడ్డ చీకటి చెదిరిపోతుందనే దివ్యవాణి నా మనసుకు వినపడింది;
ఆ చిమ్మ చీకటిని చేధించుకుంటూ నీ వైపుకు ప్రయాణం మొదలుపెట్టాను.

iii.నా ప్రేయసి కాఠిన్యం నన్ను పిచ్చి వాణ్ని చేసింది;
వంచన అనే తాడు నన్ను దుఃఖం అనే ఊబి లోకి ఈడ్చుకుపోయింది;
నఖ శిఖ పర్యంతం ఆ ఊబి లోకి దిగబడి ఊపిరి ఆడక అస్తమించబోతున్న నన్ను;
సమస్త మానవాళికి ఇష్ట సఖుడివైన నీ నుండి వెలువడిన ప్రాణ శక్తి అనే రక్షణ రేఖ , ఆ ఊబిలో నేనొక నిశ్చల నిర్జీవిగా మారకుండా కాపాడింది.

iv.ఏమని చెప్పను నా ఈ లోక రీతి,
వసుదేవుడను కంసుడు బంధింప జూడ దేవకియే అందించె సాయము,
మగడి వెంట కానలకు నడచు సీతలు కరువాయను,
అభినవ కుంతులు అధికమాయను,
మల్లె తీగల వంటి పడచులు తేనె తీగలుగా మారెను.

v.పెంకుటిళ్ళలోన గరికలతో గూడు కట్టిన నిన్ను నేను మరచిపోలేదు,
చిట్టి చిట్టి శబ్దములతో, ముద్దు లోలుకు కాయముతో నన్ను అలరించు నిన్ను నేను మరచిపోలేదు,
పిచ్చుకమ్మా, పిచ్చుకమ్మా అని అమ్మమ్మ నిను చూపిన రోజులు నేను మరచిపోలేదు,
నిన్ను కబళించి మాకు కానరాకుండా చేసిన ఆ మృత్యు యంత్రం మమ్ము సైతం కబళిస్తుంది.

కర్తవ్యం

చేతిలోని పనిని చక్కగానిర్వహించునంతయు ఉన్నతుడగును మనిషి,
పనిన హెచ్చు తగ్గులు చూడక కార్యార్థి అయినవాడు వికసింపుట తథ్యము,
అత్మనూన్యత,అహంభావము అను రెండు అంతములను విడనాడి అంకితభావముతో నిష్కామ కర్మాచరణము జేయవలయును,
అవని అంతయూ అంధకారము ఆవహించియున్నపుడు జ్ఞాన కాంతులు ప్రసరింపజేసి అజ్ఞాన తిమిరాలను పోగొట్టిన వేద ద్రష్టల శక్తియుక్తులకు మనము వారసులం,
భారత యువత అట్టి ఘన వారసత్వాన్ని నిత్యము మననము జేసుకున్న ఆత్మవిశ్వాసమునకు అంతుఉండదు.

మృత్యు సమయం

అతని మనసున ఎన్నో తలపులు, మరెన్నో ఆశలు,కన్న బిడ్డల భవితకై బహు ప్రణాళికలు , ఆలిని అలరించుటకు ఆలోచనలు;
అతనికి తెలియదు అది అన్ని దినముల లాంటి దినములు కాదని, ప్రొద్దున్నే ప్రక్కన జేరెను యమ దూత వచ్చి;
పుడమిన కలియనున్న కాయమునకు అలంకారములు,తాను రాచిన రాత తాను సైతం మార్చలేని దేవునకు మ్రొక్కులు;
బయటకు వెడలునపుడు ఆలికి ఆలింగనం, కన్న బిడ్డకు కమనీయ పలకరింపు;
అది చూచిన యమదూతకు సైతం కారెను కంటనీరు;
కోవెల జేరి కాలభైరవునకు మ్రొక్కెను,కార్యసాధనకై వెడలిన కొన్ని ఘడియల్లో సంధింపబడె యమపాశము,మృత్యు ఒడిని చేరె అతని కాయము;
అర్ధ శరీరము కనుల ముందు ఉన్ననూ,కన్న బిడ్డ కంట నీరు కనబడచున్ననూ,ఆశలు ఆవిరై ఆయువు ముగిసెను.

వాలెంటైస్ ప్రేమ

కడగండ్ల పాలు జేసిననూ బిడ్డ కొరకై పరితపించును కన్న తల్లి .... అది తల్లి ప్రేమ,

తల్లి బిడ్డను తొమ్మిది నెలలు కడుపున మోయగా పాతికేండ్లు తండ్రి బిడ్డను భుజముపై మోయును ... అది తండ్రి ప్రేమ,

కన్న వారలు గతించిన పిమ్మట వారి గుర్తులుగా మిగిలిన తోడబుట్టిన వారి కొరకు పరితపించును మన మనసు ... అది సోదర ప్రేమ,

మరేంటి ఈ వాలెంటైన్ ప్రేమ?

వయసు కాని వయసులో కలిసి,బుద్ధికి లొంగని మనసుతో చూచి,వ్యామోహంతో వలచేది కాదు ఈ వాలెంటైన్ ప్రేమ,

క్లాడియస్ క్రూరత్వానికి వాలెంటైన్ బలయ్యింది ప్రేమ కొరకు కాదు పెళ్లి కొరకు,

మనమెవరో తెలియక ఏడడుగులతో ఒక్కటై,

ఆ పై ప్రతి అడుగులోఅడుగై, కష్టాల్లో తోడై,సుఖంలో భాగమై,దుఃఖంలో ఓదార్పై, మనమే జీవితమనుకుని మనతో నడిచే సహవాసి ప్రేమే ఈ వాలెంటైన్ ప్రేమ!

భీతల్లరి

అల్లరి బాబోయ్ అల్లరి ,

మా చిచ్చర పిడుగుల అల్లరి ,

మండే బొగ్గు , కరెంటు ప్లగ్గు ,

స్నానాల గది , పానాల గది ,

వంటిల్లు , విడిదిల్లు ,

కుక్కపిల్లలు , పిల్లిపిల్లలు ,

చీమలు , దోమలు

కంచాలు , మంచాలు

దేవుని కొలువు , బొమ్మల కొలువు

చేపల మార్కెట్టు , సూపర్ మార్కెట్టు

మర యంత్రాలు , కరెంటు యంత్రాలు ,

కాదేదీ అల్లరి కి అనర్హం,

అల్లరి కాదు బాబోయ్ అల్లరి కాదు,

ఇది భీతల్లరి !

వెన్నుడికి వేడుకోలు

i. నారాయణ! నా మనసు అల్లకల్లోలమవుతున్నది,
కాముకత కళ్ళను గమ్మి ఏమీ తెలియరాకున్నది.
నీ వెచట నున్నావో నాకు తెలియరాకున్నది,
నిను చేరవలెనన్న ఆశ తప్ప ,మార్గము నాకు కానరాకున్నది,
నారీ స్థన నాభులు నీ నుండి నా దృష్టి మరల్చుచున్నవి,
అంధుడనయి అరిషడ్వర్గ పీడితుడనయితిని.
ఈ తెగులు తెల్లారి నిను చేరు తోవను నాకు దెలుపుము.

ii. నారాయణ! ఎన్ని కాంచాలి నేను ఈ జీవితాన!
పుట్టుట,గిట్టుట ఏక కాలాన జరిగెను ఒక ప్రాణికి,ఇదేమి కర్మ ఫలము సూచించును,
ముష్కర మూకల మరణ మృదంగ ధ్వనులు, అమాయక ప్రాణుల రుధిర దారలు,బంధుగణ హాహాకారాలు,ఎవరి కర్మ ఫలము ఇది,
కొండ గట్టున జేరిన భక్త జనులకు కొరివి పెట్టబడెను,ఇదియునూ నీ జగన్నాటకమేనా?
నిండు జీవితమనంతర మరణం బాధింపదు పెక్కుగా,అకాల మరణం బాధింపక తప్పదు,ఇది జీవిత సత్యం.
వద్దు,ఈ జన్మ జరా మరణములు,నీ సాయిజ్యము త్వరతిగా ఒసగుమయ్య మాకు.

iii. నారాయణ! నా ఈ దేశాన అణగారుతున్న నైతిక విలువలు నిలబెట్టుటకై ఆది వరాహ మూర్తిగా మరల అవతరింపుము,
మత్స్య మూర్తిగా మరల వచ్చి మాలోని మదమోహ మాత్సర్యములను మాపుజేయుము,
కుర్మరూపుడివై వచ్చి మాలోని కామ,క్రోధ,లోభములను కాలరాయుము,
నారసింహుడిగా మరల అవతరించి అధర్మమును చీల్చి చెండాడుము,
వామనుడిగా విచ్చేసి అన్యాయమును,అవినీతిని అదఃపాతలముకు తోక్కివేయుము,
పరశురామునిగా మరల వచ్చి మాలో తాండవము చేస్తున్న మారుని సంహరింపుము,
పల్లెల్లో పాడుబడుచున్న రామాలయాల నుండి ధర్మకాంతులు విరజిమ్మి మమ్ములను ధర్మము వైపుకు నడిపింపుము,
బలరామునిగా వచ్చి అన్నదాతకు ఆయువు పోయుము,
రాతి ఆలయాల్లో వేణుగోపాలునిగా వెలసియున్న నీవు ముక్తి ధామముకు మాకు మార్గము చూపుము,
కల్కిగ త్వరతిగా వచ్చి మాలోని దైవత్వమును వెలికితీయుము.

రాజ్ కుమార్ కు అక్షర మాల

కన్నడ కంఠీరవుడు,
కన్నడ నట సార్వభౌముడు,
కన్నడ నాట మేరునగధీరుడు,
కన్నడ సీమకు మణి మకుటం,

పుట్టుస్వామయ్య ముద్దుల తనయుడు, కన్నడిగుల అభిమాన కుమారుడు,
కన్న ఊరు గాజునూరు, పెంచిన ఊరు బెంగళూరు,

పట్టభద్రుడు కాదు కానీ పట్టం గట్టించుకున్న మొనగాడు,
ఆజానుభాహువు కాదు కానీ అందరినీ అలరించే అలరాజు,
మందికాల్లోకొచ్చి భూమినేలమంటే వలదన్నాడు,
కన్నడమాతకు ఆపదొస్తే గర్జిస్తూ ముందుకొచ్చాడు,

తెరపై కనిపించిన చాలు కనక వర్షం,
ఒక్క పలుకు పలికిన చాలు, మందిలో ఉవ్వెత్తున ఎగసే ఉప్పెన తరంగం,

చదువు నేర్వని కన్నడ సంగీత సరస్వతి ముద్దుల కొమరుడు, గాన గంధర్వుడు,

రాఘవేంద్రుని ప్రియ భక్తుడు,

నరహంతకుడు సహితం కత్తి దూయలేని మానవతామూర్తి మత్వం,

ముత్తురాజు అతని స్వరూపం,రాజ్ కుమార్ అతని విశ్వరూపం.

మూడవ భాగం

రాఘవేంద్ర స్వామి

i. తెనుగు దేశ అతిధి, కన్నడ దేశ అభ్రమణి,
పాదోదక మహిమచే పాడురోగములు ప్రారద్రోలు,
ద్వైత మత ప్రచారముచే భవ రోగము ప్రారద్రోలు,
శ్రీ గురు రాఘవేంద్ర నమతాం శరణం.

ii. మాంచాలమ్మగా మృడాని వెలసిన తావు మాంచాల,
కృతయుగమున ప్రహ్లాద రాయల పాదస్పర్శచే పునీతమైన తావు మాంచాల,
కలియుగమున గురుసార్వభౌముని నిలయముగా మారెను మాంచాల,
మంత్రాలయముగా అజరామరమైన మెరవడి నొందును.

iii. దైత్య కులమును ఉద్ధరింప ప్రహ్లాద రాయలై వెలిసెను,
వ్యాసరాయలుగా కృష్ణరాయల కుహూ యోగమును కాలరాచెను,
వెంకటనాధులుగా అవతరించి జనుల వెతలను బాపుచున్న ,
శ్రీ గురు రాఘవేంద్ర నమతా0 శరణం.

శ్రీ రుద్రమూర్తి స్వామి

శ్రీ కాళహస్తీశ్వర భక్త శ్రేష్ట , శ్రీ వీరబ్రహ్మేంద్ర శిష్య శ్రేష్ట,
శ్రీ రుద్ర గురువేంద్ర భజతా0, నమతా0, శరణం.
దేవ బ్రాహ్మణ గురుదేవర శ్రీ రుద్ర గురువేంద్ర,
మనులాలసీమన బృందావన వాసివై మమ్ము రక్షింప
లింగ రూపునిగా నున్న గురువేంద్ర శరణం ప్రపద్యే,
ప్రచేతసునివై మా బుద్ధిని ప్రపుల్లముగా ఒనరించుము స్వామి,
మార్గశిర శుద్ధ పంచమినాడు తనరారు నీ ఆత్మను ఒరటుచే కొలిచెదము,
శబలము మాయించు నంత స్థిరమును ఒసగుము స్వామి.

అద్వైత బౌద్ధ ప్రార్థన

జయ మంగళ గాథ గానము చేసెద ప్రతిదినమున,
నా మనమే ఒక మలయముగా మార్చి పంచశీల పాటించెద,
పటిచ్చ సముత్పాదమే నాకు త్రివేదములతో సమానము,
అష్టాంగ మార్గమునే శరణుజొచ్చెద ప్రతి క్షణమున,
ధమ్మ మార్గమే నాకిక అనుష్టాన మతము.

వేదాలకు, ఆగమాలకు నిలయమైన శంకరుని మనోరథానికి,
శ్రుతుల సారమైన అద్వైత బోధకు; నా నమస్సులు.
మలి దశ సనాతన ధమ్మానికి నాంది పలికిన ఆది గురువు శంకరుడు
మరల జనించి మాలోని ఆత్మజ్ఞాన జ్యోతిని వెలిగింపగలరని నా యాచన.

కాయముతో, వాచకముతో చేయు తప్పులనే గాక మనస్సుతో చేయు తప్పిదములను
కూడా మన్నించమని తథాగతునికి, భగవత్పాదులకు నా వేడుకోలు.

కామ,క్రోధ,లోభ,మద,మోహ,మాత్సర్యాలను జయించు తోవ జూపి, మాయించు శక్తిని
ఒసగమని వారిరువురకీ నా విన్నతి.

స్వామి వివేకానంద

i. నైతిక కర్మాచరనే పరమ ధర్మమని చాటెను సిద్ధార్థుడు,
అద్వైతమే అంతిమమని బోధించెను శంకరుడు,
అద్వైత బౌద్ధమే భావి మతము కాగలదని నినదించెను నరేంద్రుడు.

ii. ఆధునిక శంకరుడై అవతరించె నరేంద్రుడు,
అనుష్టాన వేదాంతము అందించె వివేకానందుడై,
ఏమి చెప్పెను రా వీడు కుల వివక్ష తప్ప అని నిందించెను రోహితుడు,
ఒక్క మెతుకు జూడ తెలియుటకు అది అన్నము కాదు వేదము.

iii. అమెరికా దేశమున తెంపమనెను మత సంకెళ్ళను అచట,
భారతదేశమున శంఖారావము గావించి తెంపమనెను సామాజిక సంకెళ్ళను ఇచట, శతాబ్దములు గడిచిననూ
వీడిపోవు ధరణిని ఆ గర్జన ప్రతిధ్వనులు.

దక్షిణాపథ దేవర

i. వింధ్య పర్వతాల దిగువున, స్వర్ణముఖి నదీ తీరాన నెలవయి ఉన్న దేవర,
ద్రవిడ భూమికి,ద్రవిడ జాతికి శరణాగత రక్షక ,
ఓ దక్షిణాపథ దేవరా! పరమశివా! మాలో ఆత్మజ్ఞాన జ్యోతిని వెలిగింపుము స్వామీ!

ii. ఆర్యుల నారాయణుడు, యవనుల యహోవా,అరబ్బుల అల్లా,
నీవే కదయ్యా! ఓ దక్షిణాపథ దేవరా! పరమశివా!

iii. నీ నామ జపమే మాకు చతుర్వేద పారాయణము,
నీకు చేయు అభిషేకమే యజ్ఞము,
నీకు అర్పించిన బిల్వ పత్రమే యజ్ఞ భస్మము,
ఓ దక్షిణాపథ దేవరా! పరమశివా! నమతాం!శరణం!

iv. గణములు జయించిన గణాధిపతులను,
సహస్రాచక్రము పురివిప్పిన షణ్ముఖులను,
నీకు మారుగా మాకు అందించి మమ్ము సర్వదా కాపుగాసే,
ఓ దక్షిణాపథ దేవరా! పరమశివా! శరణం ప్రపద్యే!

v. విషయ చింతన జేసిన అధోగతి పాలవును,
ఈశ్వర ధ్యానము జేసిన ఊర్ధ్వగతిని పొందును,
ఇది గ్రహింపక నా మనస్సు విషయ చింతనలో మునిగిపోవుచున్నది,
సదా నీ ముందు ప్రణమిల్లి, నిన్ను దర్శించు భాగ్యము పొందిన నంది స్థానము నాకు ఒసగుము తండ్రీ!

vi. నా మనస్సులో కామము జనించి, అది తీరక క్రోధము పురివిప్పుచున్నది,
నా మనస్సులోనే నీకు నేను కొలువు కట్టి ఆ దుష్ట కామమును త్రోసివేసెదను,
ఓ దక్షిణాపథ దేవరా! పరమశివా!నన్ను నేను జయించు శక్తిని నాకు ఒసగుము తండ్రీ!

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి

తిరుమల గడపయగు కడపసీమలో భవిష్యవాని వినిపించిన గురువేంద్ర,
జీవ బ్రహ్మైక బోధతో ఇస్లాము రాజ్యములో ధర్మాన్ని త్రెప్పరిల్లించిన సిద్ధుడా,
కందిమల్లయ్య పల్లిలో సమాధి నుండి మాపై కరుణ జూపించు అవధూత,
ద్వాదశాక్షరీ మంత్రము జపించినంతనే మమ్ములను రక్షించే శ్రీ వీరబ్రహ్మేంద్ర నమతాం,శరణం.

అద్వైత వేదాంతము

మండ్యూకోపనిషద్ సారము,గౌడపాద బోధామ్రుతము,
ఆదిశంకరుని శంఖారావము అద్వైత వేదాంతము,
నిర్గుణుడు,నిరాకారుడు అయిననూ శుద్ధ చైతన్యముగా అవని అంతయూ ఆవహించి యుండును ఆ పరబ్రహ్మము,
మాయవాదముకు సాటిరాదు శూన్యవాదము,
శ్రుతి ప్రమాణమే గానీ బౌద్ధుల ఎంగిలి కూడు కాదు ఈ వాదము.

అనుమ అష్ట గుణ ధ్యానము

ఒరవడి :అనుమ భిక్షు రూపమున వెడలె రామ లక్ష్మణుల జెంతకు,అప శబ్దములు లేని మాటలు విన్న రాముడు ముగ్దుడాయను అనుమకు.

ఉగితి: పాదుకుని ఉండును బంధ బాంధవ్యములు నాలుకపై,జాగురూకుడై జారకు నోరు ఎన్నడూ.

ఒరవడి: మరిచెను సుగ్రీవుడు రామునికి ఇచ్చిన మాటను,మేల్కొల్పెను అనుమ.

ఉగితి: ఆడిన మాటను తప్పు వాడు తగడు దేనికీ.

ఒరవడి: అవరోధములను అధికమింపక అంగదుడు ఆయువును ముగించుటకు సిద్ధపడినంతన అంజనీనందనుడు శాంతపరిచెను.

ఉగితి: అవరోధములను లక్ష్య పెట్టక లక్ష్య సాధన జేయువాడు నేర్పరి.

ఒరవడి: సీత అపహరణ గూర్చి సంపాతి సమాచారమిచ్చెను.

ఉగితి: కష్టజీవికి సాయము అందును కనురెప్ప పాటున.

ఒరవడి: కడలి గట్టున చేరిన వానరసేనను భీతిగొల్పెను భీకరఘోష, లెక్కసేయక కడలిని లంఘించెను అనుమ.

ఉగితి: కల్లోలమును ఖాతరు జేయని వానికి సొంతమగు కడలి సైతము.

ఒరవడి: అంగులమంత కాయముతో సురస నోటజేరి అణుమాత్రలోన బయటకు వెడలెను అనుమ.

ఉగితి: కష్టములను,కడగండ్లను దాటిన కార్యసిద్ధి కలుగును.

ఒరవడి: కానరాక సీత ఎంత వెదికిన, అనుమకు ఆశ ఆవిరయ్యెను.

ఉగితి: చితి కాల్చు జీవము కాయము వదలిన పిమ్మట,చింత చంపు మనిషిని బతికుండగ.

ఒరవడి: వడలిపోయిన కాయముతో,దీనమైన మోముతో నున్న సీతను జూచి చలించిపోయను అనుమడు.

ఉగితి: పరుల బాధలను మన బాధలుగా ఎంచవలయును.

అంధకాట్ట గాథ (పారమితల స్మరణ)

ఒరవడి: నీటి పోరు నివారణకు ఎతినించి దండన పాలైన గౌతముడు సత్యాన్వేషణకై బయలుదేరెను.
ఉగితి: గౌతముడి త్యాగనిరతి మాకు జయమంగళము కలుగజేయుగాక.

ఒరవడి: రావిచెట్టు కింద గాఢ ధ్యానమున నిర్వాణమిచ్చు పురాణ మార్గము అవగతమయ్యను గౌతమునకు.
ఉగితి: గౌతముని ప్రజ్ఞ మాకు జయమంగళము కలుగజేయుగాక.

ఒరవడి:మూగజీవి ప్రాణమునకు మారుగా తన ప్రాణము అర్పించుటకు సిద్ధపడెను గౌతముడు.
ఉగితి: గౌతముడి జీవకారుణ మాకు జయమంగళము కలుగజేయుగాక.

ఒరవడి:గుండెకాయ చీల్చుతానన్న ఆళవకుని ధమ్మ బోధచే ఉపాసకునిగా మార్చివేసెను గౌతముడు.
ఉగితి:గౌతముడి ఓరిమి మాకు జయమంగళము కలుగజేయుగాక.

ఒరవడి:ధ్యానమునందున్న గౌతమున్ని జయించుటకు పలు విధాలుగా ఎతినించెను మారుడు.
ఉగితి: గౌతముని ఉపేక్ష మాకు జయమంగళము కలుగజేయుగాక.

ఒరవడి: యాచన జేయు గౌతముడిని జూచి వసలుడని దూషించిన అగ్గిక భారద్వాజునికి వసలుడెవరో తెలియజెప్పెను గౌతముడు.
ఉగితి: గౌతముని మైత్రీ భావన మాకు జయమంగళము కలుగజేయుగాక.

దీపావళి

అమవస వేళ జంబూద్వీపమంతా వెలుగులు విరజిమ్మే రోజు,
యమపురిలో నచికేతాగ్ని ప్రజ్వరిల్లిన రోజు,
కార్తికమాసాన కాలభైరవుని పూజకు తోరణాలు కట్టే రోజు,
బ్రహ్మజ్ఞాన కుసుమం కఠోపనిషత్తు లో విరబూసిన రోజు,
సింహము వంటి మనస్సుకల సింహబాలుడు నచికేతుడు మరణాన్ని జయించిన రోజు,
జాబిల్లి నీడమాటున దాగి తొంగి తొంగి చూసే రోజు,
అదే అఖండ భారతావనికి కాంతినిచ్చే 'దీపావళి'.

ప్రహ్లాద మనుమడు విష్ణు సాయిజ్యంబొందినరోజు,
రామరాజ్యానికి,విక్రమ శకానికి నాందీవాక్యం పలికిన రోజు,
నరకాసురుని చెరకు భరతవాక్యం పలికిన రోజు,
అదే సమస్త సింధూ దేశాన చైతన్యం నింపే 'దీపావళి'.

బౌద్ధుల చైత్యాలు,స్థూపాలు 'నిర్వాణ' ప్రతీకలైన దీపాలతో కాంతులీనే రోజు,
బౌద్ధ బిక్షువుల వర్షావాసం ముగింపు రోజు,
అఖండ భారతం త్రిశరణ,పంచశీల పఠనాలతో మారుమ్రోగే రోజు,
అదే యావత్తు బుద్ధభూమి జనన మరణాలను సూచించే దీపాలతో అలరారే ఉల్లంబన 'దీపావళి'.

అచ్చనగుండ్లు

1.నా హృదయము నందు మన్నన పొందెడది నీ హృదయమొక్కటే;
విశ్వంభరుడు ఏ విధముగా విశ్వతోముఖము నొందెనో, నీవా విధముగా నా హృదయమందు
సర్వతోముఖమునొందావు;
నీవు నాలో కాంక,కాంతి,కంతాళము కలుగజేసెదవు, అయితేనేమి నా హృదయమందు నీవు సదాతనునివి;
నేను నీలో కాంక,కాంతి,కంతాళము కలుగజేసెదను, ఏలనన నీ హృదయమందు నేను విష్ణువును;
పై మాటలు ఎందుకంటావా?
మన హృదయములు అవ్యము,మన దృష్టి ఏకాక్షము,మన ఆత్మలు ఏకాండము.
(ఆంగ్ల కవితకు స్వేచ్ఛానుసరణ)

2. పంజరం లో ఉన్న పావురం ఏదో తెలియని భయంతో తన పాటను ఆలపిస్తుంది,
సుదూరాన ఉన్న కొండకోనల్లో ఆ పాట ప్రతిధ్వనిస్తుంది,
అది ఒక స్వేచ్ఛా గీతం,రెక్కలు విరుచుకుని నింగిలోకి దూసుకెళ్ళాలన్న ఆరాటం,
పంజరం బయట ఉన్న పావురం అనంతమైన ఉత్సాహంతో తన రెక్కలతో వాయువును క్రిందకు దిగదోస్తూ నింగిలోకి దూసుకెళ్తుంది,
ఆ ఉత్సాహాన్ని నీరుగారుస్తూ ఏదో తెలియని ఉత్పాతం ఆ పావురాన్ని నేలకూల్చింది,
ఆ ఉత్పాతం ప్రకృతిని కబళించాలన్న మానవుని ఆరాటం,
నేల మీదకు రాలుతూ పంజరం లో ఉన్న తన మిత్రునికి మరణమృదంగ ధ్వనితో బయటకు రావద్దని సందేశం పంపింది.
(ఆంగ్ల కవితకు భావానుసరణ)

3. ప్రభూ! నీవు చందనమైతే నేను నీరుగా మారుతా ,
నీవు ముత్యములైతే నేను దారముగా మారుతా ,
నీవు అడవిలోకి మేఘముగా వస్తే నేను నెమలిలా పురివిప్పి నాట్యమాడుతా ,
ఎందుకంటే నీవు స్వామివి ఎల్లవేళలా నేను నీకు దాసుడను.
(హిందీ కవితకు స్వేచ్ఛానుసరణ)